# మళ్ళీ ఎప్పటిలాగే...

[కథానిక]

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

రామారావు రమణమ్మలది అనుకూలదాంపత్యమనే చెప్పాలి. ఏవో దూరదేశాలనుండి తెచ్చిన రెండు మొక్కలకు అంటుకట్టినట్లు కనిపిస్తుంది వాళ్ళ దాంపత్యం. ఇద్దరూ చిన్నతనంలో ఎవరో దూరపు బంధువులదగ్గర పెరిగినవారే—పెళ్ళికావడంతో ఇద్దరికీ అదివరకుండే బంధాలు సడలిపోయినాయి.

పెళ్ళయినకొత్తలో "కాస్త స్థిరమయిన ఉద్యోగమూ, ఒకమాదిరి వాసయోగ్యమైన ఇల్లూ దొరికితే చాలు—నిర్విచారంగా బ్రతకగల" మనుకొన్నారిద్దరున్నూ.

ఆ రెండూ ఒక రెండేళ్ళలోనే లభించేయి. 'అమ్మయ్య!' అనిపించింది భార్యాభర్త లిద్దరికీని. "ఇప్పుడరవై ఇస్తున్నారా, క్రమేపీ అదే నూటఇరవై అవుతుంది—ఆశ కెక్కడికి? చాలదూ, మనిద్దరికీ?" అన్నాడు రామారావు.

"ఓ, చాలకేం? మనకే కాదు మరిద్దరికికూడా చాలు" అంది—అతను 'మనిద్దరికీ' అన్న మాటకు లోలోపల కించపడిన రమణమ్మ. కాని రామారావుకు మాత్రం ఆమె మాటలోని సారస్యం అర్థం కాలేదు—నిబ్బరమైన ఉద్యోగం సంపాదించగలిగానన్న అప్పటి ధీమాలో.

తరువాత అట్టేకాలం రమణమ్మ తన కోరికను మనస్సులో దాచుకోలేకపోయింది. ప్రతినెలా జీతం అందగానే ఏదో ఒక కొత్త వస్తువు తెచ్చి, కొంతసేపు చూపకుండా దాచి, నెమ్మదిగా బైటికి తియ్యడం అతని కలవాటు. మొదట్లో రమణమ్మ ఎంతెంతో ఆనందించేది అటువంటి బహుమతుల మూలంగా. కాని క్రమంగా "ఎందుకండీ ఇలా డబ్బు తగలేస్తారు? ఇప్పుడు నాకేం చీరలూ, జాకెట్లూ లేవుగనకనా?" అనేది.

"ఉంటేమాత్రం, మరికొం దుండకూడదేమిటి?" అనేవాడు రామారావు.

"బట్టల కేమిటి, ఎన్ని ఉన్నా వద్దనవు. మనమే కాస్త చూసుకోవాలి ముందుముందు ఎటువంటి అవసరాలు వస్తాయో" అనేది రమణమ్మ.

"ఇప్పటి సరదాలు మానుకొని ఎప్పటికో దాచేదేమిటి లెద్దూ? నేను తెచ్చేది మన అవసరాలకు చాలకపోదు. ఇక కూడబెట్టడంమాటా? వాళ్ళే ఏదో ఇంత ప్రావిడెంటుఫండుకింద ఏర్పాటుచేస్తున్నారు. అది మనకు చాలదంటావా?" అని ఎదురుచెప్పలేనంత కట్టుదిట్టంగా తన అభిప్రాయాన్ని వెలార్చినట్లు తృప్తిపడేవాడు రామారావు. కాని రమణమ్మకుమాత్రం అతని ధోరణికి ఆధారమే లేనట్లు రూపించేది.

"ఏమిటండీ అలా మాట్లాడతారు, రేపొద్దున్న మనకుమాత్రం పిల్లలూ పాపలూ కలగరా, వాళ్ళకు చదువులూసంధ్యలూ చెప్పించి పెళ్ళిళ్ళూ పేరంటాలూ చెయ్యక్కర్లేదుటండీ? పొరుగుప్లీడరుగారిని చూడండి, ఆయ నెంత తెచ్చినా వాళ్ళ ఖర్చులకు కటాకటీగానే ఉంటున్నది. అంచేతుండే, మనం ఇప్పుడే కాస్త జాగ్రత్తపడకపోతే తర్వాతతర్వాత మళ్ళీ ఇబ్బందులు పడతామేమోనని"—ఇదీ ఆవిడవాదన.

ఆవిడలోపలిలోపలి అభిప్రాయం కాస్తా బైటపడిపోయింది.

మొదట్లో రామారావు "పోనిద్దూ, పిల్లలేమిటి, నానాగోలాను, ఇంట్లో శాంతన్నది ఉండదు" అన్నాడు.

తరవాత కొన్నాళ్లకు, "పిల్లలు కలిగితే నేనేం వద్దనను. కాని లేరనే విచారం నాకేం లేదు. పిల్లలుండడంలో ఎలాగయితే కొన్ని సదుపాయా లున్నాయో లేకపోవడంలోనూ కొన్ని సదుపాయాలు లేకపోలేదు" అనసాగాడు.

మరికొన్నాళ్ళకు—"పిల్ల లుంటే బాగానే ఉంటుంది. అలాగని డజన్లకొద్దీ కాకుండా, ఒక ళ్లిద్దరు ఉండడం అదీ ఒకవిధమయిన అనుభవమే. అయితే ప్రపంచంలో అందరూ అన్నిరకాల అనుభవాలూ అనుభవించడానికి వీ లుంటుందా?" అనేవాడు విరక్తిగా.

ఇటీవల "పోనిద్దూ, మనకు కలిగితే కలుగుతారు, లేకపోతే లేదు. కాని, దేశాలు తిరిగి కొండ లెక్కి దిగినంతలో లాభిస్తుందని నాకేం నమ్మకంలేదు సుమా" అంటున్నాడు.

ఇప్పుడిప్పుడు అతని సంకోచమల్లా యాత్రల కోసమని సెలవుపెట్టి వెళ్తే నలుగురూ తనను మూఢ విశ్వాసాలు కలిగిన పూర్వాచారపరాయణు డను కొంటారేమోనని. కాని మరి తప్పేటట్లు తోచలేదు.

తనకంటే సర్వీసులో ఎంతో జూనియర్లయిన గుమాస్తాలు ఇద్దరుముగ్గురు పిల్లలతో పెద్ద ముసలివాళ్ళ లాగ కబుర్లు చెప్పడమూ, కాస్త ఎక్కువసేపు పనిచేద్దామన్నా, ఆదివారం ఆఫీసుకు వద్దామన్నా "ఎలాగండీ, వారానికంతకీ ఉన్నది ఒక్క రోజు సెలవు. ఆ ఒక్క రోజయినా బజారుపని చూసుకొని, పిల్లలతో కాస్త హాయిగా కాలక్షేపం చెయ్యకపోతే?" అనేవారు బాగా తనకు తగలాలనే. అంతేకాదు, బజారుదారిని తా నింటికి వస్తూంటే ఎవడో స్నేహితుడు కనిపించి, "భాయీ, పర్సు ఇంటిదగ్గర కోటుజేబులో ఉండిపోయింది. నీదగ్గర ఒక రూపాయుంటే ఇద్దూ, ఇంటికి వచ్చేసరికి ఏదైనా తేకపోతే పిల్లలు చిన్నబోతారు" అనేవాడు. ఇంతేకాదు. ఎవళ్ళ సంభాషణలో ఎక్కడెక్కడ పిల్లల ప్రసక్తి వచ్చినా, చాలాకాలానికి కలిసిన పూర్వస్నేహితులు 'పిల్ల లెందా'రని అడిగినా, అదంతా తనను అవమానం చెయ్యడానికే అన్నట్లుండేది రామారావుకు. వీటికి తోడు తన భార్యకూడా ఇరుగుపొరుగువాళ్ళ పిల్లలను ఎంతో ఆప్యాయంగా ముద్దులాడటం, తననుకూడా ఎత్తుకోమనీ, ఆడించమనీ బలవంతంచెయ్యడం లోలోపల ఏదో చెప్పలేని బాధగా ఉండేది రామారావుకు.

"ఇప్పుడు ఆ యాత్రాస్థలాలన్నీ తిరిగివచ్చినందువల్ల పిల్లలు కలిగితీరుతారని కాదుగాని, పాపం ఆవిడకు అంత ఆశగా, పట్టుదలగా ఉన్నప్పు డెందుకు కాదనాలి? ఏలాభం ఉన్నా లేకపోయినా, అక్కడి శిల్పసౌందర్యమూ, ప్రకృతిరామణీయకమూ దర్శించడాని కేమీ అభ్యంతరం లేదుకదా?" అని తన యాత్రాప్రయత్నాన్ని సమర్థించుకొందుకు చూశేడు రామారావు.

కాని లోపల్లోపల అతనిలోనూ ఆశాలేశం లేకపోలేదు. ఏమో లాభించకూడదా, ఏ మహత్తూ లేకపోతే ఇన్నిలక్షలమంది ఎన్నో శ్రమదమాదులుపడి ఎందుకు వెళ్ళివస్తూంటారని.

మద్రాసులో ఉన్న ఎవరో దూరపుబంధువులను చూడడంకోస మని అతను ఆఫీసులో తనకంటే తక్కువవాళ్ళతోకూడా చెప్పిచెప్పి బయల్దేరేడు.

రమణమ్మమాత్రం తన స్నేహితురాళ్ళతో "ముందు తిరుపతి వెళ్తాం, తరవాత మాఆయనబంధువు లెవళ్ళో ఉన్నారట, వెళితే చెన్నపట్నంకూడా వెళ్తాం"అని చెప్పింది.

మొత్తంమీద ఆఫీసులో అ దరికీ రామారావు ప్రయాణ కారణం త్వరలోనే తెలిసిపోయింది.

"నడుం మునిగేవరకూ చలి, నలుగురికీ తెలిసే వరకూ సిగ్గు"అన్నట్లు, తరవాత తరవాత రామారావు యాత్రలకని బయలుదేరడంలో ఏమీ మొగమాట పడడం లేదు. అయితే ఇప్పటికీ తన కేమీ నమ్మకం లేకపోయినా, భార్యను తృప్తిపరచడంకోసమూ, వాతావరణంమార్పుకోసమూమాత్రమే యాత్రలు చేస్తు

ట్లుగా చెప్పుతుంటాడు. కాని అతని మాటలధోరణిలో బలం లేదన్న సంగతి చిన్నపిల్లలకుకూడా తెలిసి పోతుంది.

ప్రతినెలా పదిహేను ఇరవై చొప్పున వేరే ఉంచడమూ, ఏడాదికి ఒక ఇరవై రోజులు శెలవు పుచ్చుకొని ఏదో ఒక యాత్ర చేసుకొని తిరిగిరావడమూ ఇది ఒక పరిపాటి అయిపోయింది రామారావు రమణమ్మల జీవితంలో.

ఆ ప్రాంతంలో ఎవ రెవరికి ఎన్నెన్ని సంవత్సరాల అనంతరం పిల్లలు కలిగేరో ఆ వైనం రమణమ్మకు కరతలామలకం. సుమారు ఇరవై సంవత్సరాలతరవాత పిల్లలు కలిగినవాళ్ళుకూడా ఉన్నారు. అటువంటిది, ఏదీ, ఇంకా పదకొండేళ్ళకంటే ఎక్కువ కాలేదు. అంచేత లేకపోలేదు ఆశాలేశం.

అయినప్పటికీ రమణమ్మలో మునపటి ఆ ధైర్యమూ, పట్టుదలా లేవు.

"ఒకమారు వెళ్ళేం కదుటండీ, మళ్ళీ ఎందుకు సింహాచలం వెళ్ళడం ?" అంది ఆమె నిరుత్సాహంగా.

"ఎందుకేమిటి, నే నన్నిఏర్పాట్లూ చేసేను. ఇప్పుడు మరొకదీనికోసం కాదు. అలా తిరిగివస్తాం. సాలు మున్నూటఅరవై రోజులూ ఇలా వెధవఆఫీసూ, కాగితాలూ—తలనొప్పిగా ఉంది. కొంచెం దేశం తిరిగివస్తే, జనసమూహాన్ని చూస్తే కొస్త హుషారు కలుగుతుంది" అన్నాడు రామారావు.

కాని ఆమెకు అట్టే తృప్తిగా లేదు. అతని ప్రోద్బలమే లేకపోతే ఆ సంవత్సరం ప్రయాణం జరగకనేపోవును.

భగవంతుడి ఆగ్రహానుగ్రహాలు ఏరూపంలో వస్తాయో ఎవరు చెప్పగలరు ?

దంపతులు చక్కటి మూడేళ్ళ పిల్లవాడితో సహా తిరిగివచ్చేరు.

ఇద్దరూ కూడబలుకుకొని, నలుగురితోనూ "మావాళ్ళే—బంధువులు; అక్కడ కలిసేరు. ఇంకా పద్దెనిమిదేళ్ళయినా లేవు, ఆ అమ్మాయిభర్త పోయేడు. మళ్ళీపెళ్ళి చేసుకొందుకు ఈ పిల్లవాడొకడు... పోనీ, మేం పెంచుకొంటా మన్నాము" అని చెప్పేవారు.

కాని దంపతులిద్దరికీ ఒక ఆర్నెల్లపాటు బితుకుగానే ఉండేది—ఎక్కడ అసలువాళ్లు వెతుక్కుంటూ వస్తారో అని. అయితే తామూ. అంత అన్యాయం చెయ్యలేదు. అక్కడ. కొంతమందితో చెప్పేరు. ఏవో నలుగురూ చూడని పత్రికల్లో అనూ పానూ దొరక్కుండా అరంగుళం ప్రకటనలు చేసేరు. ఇంతకంటే ఏంకావాలి, తమ విధి తాము నిర్వహించినట్లు ఋజువుకు. కాని ఎవళ్ళూ వెతుక్కుంటూ రాలేదు. పిల్లవాడు పూర్తిగా తమ హక్కే నన్న విశ్వాసం భార్యాభర్తల్లో కలిగింది.

పిల్లవాడికి 'వెంకటనరసింహం' అని తిరుపతి సింహాచలందేవుళ్ళిద్దరిపేళ్లూ జోడించి పెట్టేరు. ముద్దుగా 'సింహం' అనేవారు.

ఆ చుట్టుపక్కల ఎవరి పిల్లలకూ జరగనంత ముద్దూ మురిపెమూ జరిగేది నరసింహానికి.

"వాళ్ళకంటే ఒక్క పిల్లడుగనక ఏంచేసినా చెయ్యగలరు. నలుగురు పిల్ల లున్నవాళ్ళకు అలా ఎలా కుదురుతుంది ?" అంది జానకమ్మ.

"అహఁ. ఒక్క పిల్ల డుంటేమాత్రం మరి తక్కిన ప్రపంచమే లేకుండా నెత్తికెత్తిపోతా రేమిటి ? వాళ్ళకంటే సుమారు పదిపదిహేనేళ్ళపాటు లేకలేక కలిగేడుగనక—"అంది సరస్వతి.

"నీకు బాగానే తెలుసును. ఆ పిల్లడు వాళ్ళ పిల్ల డనుకున్నా వేమిటి ? నిరుడు సింహాచలం వెళ్ళినప్పుడు అక్కడ దత్తత చేసుకున్నారట—" అంది ఇందిర.

"నీ కంతకంటే తెలీదు. అక్కడ పిల్లవాడు వీళ్ళకు దొరికేడట. ఎప్పటికయినా అసలు తల్లిదండ్రులంటూ వస్తే ఇచ్చేయవలసిందే" అంది సత్యవతి.

"ఎవళ్ళో కిట్టనివాళ్ళలా అంటారు ; కాని ధైర్యంగా తెచ్చుకొని పెంచుకోగలరుటర్రా ! మనం

చూడని సంగతులు మన కెందుకు" అంది సర్దుబాటుగా శాంతమ్మ.

"ఏమయితేనేం? నొప్పులబాధ పడక్కర్లేకుండా పిల్లవాడి ముద్దుముచ్చటలు తీర్చుకోగలుగుతున్న" దంది కొత్తగా గాజులు తొడిగించుకొన్న సుశీల.

"మన సుశీల ఇప్పణ్ణించే నొప్పులబాధ పడుతున్నదర్రా!—" అంది సీతారత్నం. అందరూ గొల్లుమని నవ్వేరు.

"నే ననేది అది కాదర్రా. నామాటే కాదు, లోకంలో ఎవళ్ళకూ నొప్పులబాధ పడకుండా పిల్లలు కలగరుకదా ఎవళ్ళో రమణమ్మలాంటి అదృష్టవంతులకు తప్ప—"అని తననే సమర్థించుకోజూసింది సుశీల. కాని ఆ నవ్వులహడావిడిలో ఆమెసమర్థింపును వినేవాళ్లెవళ్లు?

కాని, సుశీలఈర్ష్యే ఫలించిందన్నట్టు రమణమ్మకుకూడా మరొక ఏడాదిలో ప్రసవవేదన పడవలసిన పరిస్థితి ఏర్పడింది.

భార్యాభర్తల ఆనందానికి మితి లేదు. ఈ అదృష్టానికి తమ ఇలవేల్పుల దయ కలిసిరావడంమీద ఎంతయితే నమ్మకం ఉందో, అంత నమ్మకం వెంకట నరసింహం తమకు లభించిన వేళావిశేషంమీద కూడా ఉండేది ఇద్దరికీని.

ఆసంవత్సరం అనుకోకుండా రామారావుకు జీతం పదిరూపాయలు ఎక్కువయింది. అన్నిటికీ సింహమే కారణం. వాడి ముఖంలో అటువంటి కళ ఉంది!

"అయితే సింహాలూ, నీకు తమ్ముడా, చెలెమ్మా ఎవళ్ళు కావాలమ్మా?" అని అడిగేది రమణమ్మ.

ఒకమారు తమ్ముడనీ, ఒకమారు చెల్లెలనీ, వేరొకమారు ఇద్దరూ కావాలనీ భార్యాభర్తలిద్దరినీ సంతృప్తి పరచేవాడు నరసింహం.

"ఎలాగూ మనకు సింహాలుబాబు ఉన్నాడు కదా, ఈ పుట్టేది ఆడపిల్లయితే ఆ సరదాకూడా తీరుతుం" దనేవాడు రామారావు.

"మొగపిల్లడయితేమాత్రం, ఇద్దరూ ఉంటారు. మీకేం ఇద్దరు పిల్లలంటే ఎక్కువగా కనిపిస్తున్నారు కాబోలు" ననేది రమణమ్మ.

"ఎక్కువని కాదుగాని, ఆడపిల్లయితే, చూడూ, దానికి తగిన చదువూ, సంగీతం చెప్పించడం, పెళ్ళి చెయ్యడం అదంతా అదొకరకమయిన అనుభవం. ఇద్దరూ మగపిల్లలయితే అదంతా ఏం తెలుస్తుంది" ఇది రామారావువాదన.

"మీ రేమన్నా అనండి, మొదట మొగపిల్లవాడు కలిగితేనే ముచ్చట. తరవాత మనకు అదృష్టం ఉంటే ఆడపిల్ల కలగకూడ దేమిటి?" ఇది రమణమ్మకోరిక.

చివరకు ఆవిడకోరికే ఫలించింది. మగపిల్లవాడే కలిగాడు.

రెండు వస్తువులుగాని, ఇద్దరు పిల్లలుగాని ఒకే దగ్గర ఉండేసరికి అప్రయత్నంగా తారతమ్యదృష్టి వచ్చేస్తుంది.

పుట్టిన పిల్లవాడు దుర్బలంగా ఉంటేనేం, చాలా తెల్లగా ఉంటాడు. కొందరు "పెద్ద కళ్లూ, విశాలమయిన నుదురూ—ఒకింత చాయ తక్కువయితే నేం?" అని పెద్దపిల్లవాడే బాగుంటా డన్నారు. మరికొందరు రెండవపిల్లవాణ్ణి పసందుచేశారు.

రామారావు రమణమ్మల కంటికి ఇద్దరూ రెండు రత్నాల్లాగ కనిపించేవారు. అందులో ఏమీ సందేహం లేదు. ఇంకా ఆమాటకు వస్తే రామారావుకు సింహాలంటేనే ఎక్కువముద్దు. వాడు తాను ఇంటికి వచ్చేసరికల్లా ఎదురుగా వస్తాడు. "ఏమైనా తెచ్చేవా నాన్నా" అంటాడు. ఎన్నెన్నో ముద్దుకబుర్లు చెప్తాడు. ఏవేవో కథలు చెప్పమంటాడు. వాడితో తానూ ఒకటయిపోగలడు రామారావు. ఆ మాటలురాని, మాటిమాటికీ ఏడుస్తూఉండే పిల్లవాడితో భార్య అంతలా కాలక్షేపం చెయ్యగలగడం అతనికి ఆశ్చర్యంగానే ఉండేది మొదట్లో. రమణమ్మకూడా అంటూ ఉండేది—"ప్రకాశం కొంచెం తెలుపు అన్నమాటేగాని, సింహాలే ఎంతో ఇదిగా ఉంటాడు. వాడి కళ్ళేమిటి, వాడి

మొగంలో ఎంతవాడయినా అవడానికి తగిన కళ ఉంది" అనేది. అలాఅలా ఏవో వాడినిగురించిన కబుర్లు చెప్పు కొని, ప్రపంచాన్నీ, తమనీకూడా మరిచిపోగలిగేవారు దంపతు లిద్దరూను.

అటువంటివారిలో స్వపరభేదము కలిగించ దన డానికి కాదు. మానవస్వభావంలో ఉండే ఒక ప్రత్యేకలక్షణం అది. ఇద్దరు చిన్నపిల్లలు ఒకేదగ్గర ఉండేసరికల్లా, వాళ్ళల్లో మిక్కిలి చిన్నవాళ్ళను బాగా చేరదీసి, అన్నింటికీ సమర్థించడమూ, పెద్ద వాళ్లను చీటికీమాటికీ తప్పులెంచి కూకలెయ్యడమూ మామూలు. తల్లిదండ్రులేకాదు, పెద్ద అన్నదమ్ముడో, అక్కచెల్లెలో, లేక ఎవరో సంరక్షకుడో కాని య్యండి—ఎవరికైనా సరే, ఇద్దరు చిన్నపిల్లల్లో మరీ చిన్నవాళ్లు అన్నివిషయాల్లోనూ సరీగా ఉంటున్నట్టూ, పెద్దవాళ్లు అన్నీ తెలివితక్కువ పనులే చేస్తున్నట్టూ రూపిస్తుంది.

పాపం, రామారావు రమణమ్మలుకూడా మానవ మాత్రులే.

నరసింహంది బలవంతంగా చదువుకోమనీ, బుద్ధిగా ఉండమనీ ఆజ్ఞాపనలను పొందుతున్న వయస్సు. సూర్యప్రకాశంది ముద్దుముద్దుగా నవకమాటలు నేర్చు కొంటున్న వయస్సు.

తానేమో అమ్మ పనితొందరలో ఉన్నప్పుడు తమ్ముణ్ణి ఆడించాలి. కాని, అదొక మిషకింద పెట్టు కొని తన చదువు అశ్రద్ధచెయ్యకూడదు.

తమ్ముడు ముద్దుముద్దుగా మాట్లాడుతూ, తప్ప టడుగులు వేసి, ఏదయినా వస్తువు పగలగొట్టినా, పాడుచేసినా ఎంతో ప్రతాపంకిందనే లెక్కకువస్తుంది. తాను ఆటల్లో బట్టలు మురికిచేసుకొన్నా, ప్రమా దాన్న పలక పగలగొట్టుకొన్నా, చివరకు పలకపుల్ల పారేసుకొన్నా, బ్రహ్మాండమైన నేరమే. "ఇప్పు డా వస్తువుఖరీదు ళని కాదుగాని, ఇలా మతిభ్రష్టుగా తెలివితక్కువగా తయారయితే రేపొద్దున్న పెయ్యలు కాయడానికితప్ప మరెందుకూ పనికిరాడుకదా" అని తల్లిదండ్రుల ఘోష.

తమ్ముడికి ఎన్నో బట్ట లుంటూఉండగానే, ఒకటేచిరగకమునుపే, మళ్ళీమళ్ళీ బట్టలు కొంటూ ఉండడం, తను ఎప్పటి పాతచొక్కాలూ, నిక్కర్లూ తొడుక్కుంటూఉండడం సింహాలుకు ఎంతో కష్టంగా ఉండేది.

"నే నా చింకినిక్కరు తొడుక్కుని బడికి వెళ్ళలే నమ్మా" అన్నాడు ధైర్యం తెచ్చుకొని.

"చిం కెక్కడ్రా, నిన్నసాయంత్రమల్లా పని మానుకొని కూర్చొని కుట్టేనుకదా ?" అంది రమణమ్మ.

"కుడితేమాత్రం" అన్నాడు సింహాలు. బడిలో తక్కిన కుఱ్ఱవాళ్ళవద్ద ఆ రంగువెలిసిపోయి, బైటికి స్ఫుటంగా చేతికుట్టు కనబడుతున్న ఆ నిక్కరు తొడుక్కొని వెళ్ళడం ఎంత పరువుతక్కువో ఆమె ఊహించలేకపోయింది.

"ఏదీ, ఎక్కడా చింకి కనబడలేదు. దిట్టంగా రాయిలా గుంది. మీ నాన్నే ఆఫీసుకు నేను కుట్టిన చొక్కాలూ అవీ తొడుక్కొని వెళ్తూంటే" అంది రమణమ్మ.

"ఏమి టంటా డేమిటి?" అంటూ కళ్ళజోడు తుడుచుకొంటూ వచ్చేడు రామారావు.

"ఈ నిక్కరు బాగులేదట బాబుగారికి—చూడండి, ఇంత దిట్టంగా ఉండగా పారేసుకొంటామా?" అని ఫిర్యాదు.

"అసలు బడి మానేయడానికి ఇదొక ఎత్తు" అని తండ్రి.

"రేపొద్దున్న నువ్వు నీకొడుకులకు ఎన్నేసి బట్టలు కొంటావో చూద్దాంలే" అంది తల్లి కొంత ఉల్లాసంగా.

ఏడుపుమొగంతోనే ఇంటినుండి బయలుదేరేడు. ఇంటినుండయితే బయలుదేరేడుగాని, బడికిమాత్రం వెళ్ళలే దానాడు నరసింహం.

మర్నాడు మరేదో కారణం బడికి వెళ్ళక పోవడానికి.

ఆ మర్నాడు బడిలో నిన్నా మొన్నా ఎందుకు రాలేదని ఉపాధ్యాయులవారి దండన. దాంతో ఏమయితే అవనీ అని ఆమర్నాడు తోటలలోనే గడిపేడు—బడివేళ అయిపోయేవరకూను.

బడి మానివెయ్యడం అన్నది ఒకనాడు జరిగిందా, ఇక కుఱ్ఱవాడు ఆ అభ్యాసాన్ని మరి విడిచిపెట్టలేడు. అందులోనూ చిన్నతనంలో తమను గురించి తాము ఆలోచించుకొనే అలవాటున్న కుఱ్ఱవాళ్ళకు బడిలోని నీరసజీవితానికి ఇంట్లోని నిరావృతి ఏమాత్రం తోడ్పడినా మరి వాళ్ళ పని అంతే. అవతల బడికి వెళ్ళలేరు—ఇవతల ఇంట్లోనూ ఉండలేరు. విజనస్థలాలలోని ఒంటరితనమే వాళ్ళకు శరణ్యం.

అటువంటివాళ్ళను సామోపాయంచేత మళ్ళీ మార్గంలో పెట్టేంతటి ఓపిక సామాన్యంగా తల్లిదండ్రులకూ, ఉపాధ్యాయులకుకూడా ఉండదు. ఇష్టంగానో అయిష్టంగానో దండోపాయాన్నే అవలంబిస్తారు.

సరిగ్గా నరసింహంవిషయంలోనూ ఇంతే జరిగింది. బడికి సరిగా వెళ్ళనందుకే ఆ సంవత్సరం అనేక పర్యాయములు తండ్రిచేత దెబ్బలూ, తల్లిచేత చీవాట్లూ తిన్నాడు నరసింహం. పరీక్ష పోయిందనడంతో తండ్రి కోపానికి మేర లేకపోయింది. అంతేకాదు. "చదివితే మంచి తెలివయినవాడేనండి, ఇదివరలో చూసేరు కదూ, అన్ని ఫస్టుమార్కులూ వీడివే; అయితే ఇప్పుడిప్పుడు బడిదొంగ అయిపోయేడు. చెడు సహవాసాలు కూడా చేస్తున్నాడేమోనని అనుమానం—" అని చెప్పిన మాస్టరుమాటలు అతని ఆగ్రహాగ్నికి ఆజ్యధారలయినాయి.

మొదట్లో తానూ భర్తతో కలిసివచ్చినా, రమణమ్మగుండె నీరయిపోయింది భర్త శిక్షించే విధానంతో, మధ్యను అడ్డుకొన్నందుకు ఆమెకు గట్టిగా నాలుగు చీవాట్లు తగిలేయి.

రోజల్లా గదిలో పెట్టి తాళం వేసిఉంచాలనీ, రెండు మార్లు భోజనంతప్ప చిరుతిండి ఏదీ ఇవ్వడానికి వీల్లేదనీ, ఒక అభ్యాసం లెక్కలు పూర్తిచేసి, ఇంగ్లీషు పుస్తకంలోని పాఠం రోజు కొకటి చొప్పున తాను సాయంత్రం ఇంటికి వచ్చేసరికల్లా అప్పజెప్పాలనీ రామారావు సుగ్రీవాజ్ఞ.

అన్నీ బాగానే ఉన్నాయి. అన్నింటిలోనూ తన తెలివితక్కువను కడిగివేసే ప్రయత్నమే గర్భితమయి ఉందనుకోగలిగేడు నరసింహం.

కాని ఒక్కటే అతన్ని లోపల్లోపలనుంచి క్రుంగదీసిన సంగతి—తానెందుకూ పనికిమాలినవాడుగా తయారవడమే కాక, తమ్ముడు లోకాతీతమయిన తెలివితేటలు కలవాడనీ, వాడి ప్రతిచేష్టలోనూ ముందుముందు ఎంతవాడయినా కాగల సూచన ఉందనీ, ఇంకా ఏవేవో ఇటువంటి అర్థం వచ్చే తల్లిదండ్రుల మాటలు ఆ కుఱ్ఱవాడి చెవుల్లోనే కాదు, గుండెల్లో కూడా గ్రుచ్చుకొన్నాయి.

తమ్ముడే అంత తెలివయినవాడయి, వాడే అన్నిటికీ పనికివచ్చేవాడయి, తన బడిజీతమూ, బట్టలూ అన్నీ వృథాఅయినట్లుగా ఉంటూంటే మరి తానెందుకు ఉండడం?

తెల్లవారుజామున రమణమ్మ లేచి చూసేసరికల్లా వీథి తలుపు గడియతీసి ఉంది. ఇంట్లో దొంగలుపడ్డారేమో నని గాభరాపడ్డారు. అటువంటి జాడ ఏమీ లేదు. కాని నరసింహంమాత్రం పక్కమీద లేడు.

తండ్రికోపం మరీ ఎక్కువయింది. "చెప్పేను కాదూ, వెధవకు పూచీ పేచీ లేదని. ఇంటికిరానీ, చెమ్డా లెక్కగొడతాను. తెలివితక్కువకు తోడు ఏమయినా అంటే పౌరుషంకూడాను! ఈ పౌరుషం చదువులో ఉంటే బాగుండేది" అన్నాడు ధాటీగా.

తల్లికిమాత్రం బితుకుగానే ఉంది. వాడేగాని తిరిగివస్తే, తిరుపతికొండ ఎక్కించి జుత్తు తీయిస్తానని మొక్కి ముడుపు కట్టింది.

తల్లికి ముడుపుచెల్లించవలసిన అవసరమూ, తండ్రికి శిక్షించవలసిన అవసరమూ మరి కలగలేదు. తర్వాత

తర్వాత మరి ఎంత ప్రయత్నించినా వెంకటనరసింహం జాడ దొరకనేలేదు.

"వాడు ఎలా వచ్చేడో, అలాగే వెళ్ళిపోయేడు. అక్కడికి మన కంతే ఋణానుబంధం—చిన్నప్పుడే ఆ తల్లిదండ్రు లెవళ్ళో వచ్చి తీసుకుపోయే రను కొందాం. మన ప్రకాశం బతికుంటే మన కంతే చాలు." అని భార్యను ఓదార్చాలని చూసేడు రామారావు.

కాని, తరువాత రెణ్ణాళ్లకే, ఒకళ్ళనొకళ్లు ఓదార్చుకోలేని దుర్భరఘటన జరిగింది—అన్నయ్య అలాగ ఎటు వెళ్ళేడో అయిపులేకుండా. కాని, మానవప్రయత్నా లన్నిటికీ అతీతంగా, తల్లిదండ్రులు చూస్తూఉండగానే ప్రకాశం దాటిపోయే డీ మృణ్మయ జగత్తును.

తర్వాత ప్రతిసంవత్సరం మళ్ళీ ఎప్పటిలాగే యాత్రలు చేసుకొని వస్తున్నారు దంపతు లిద్దరూను. అయితే, ఆ వెనకటి ఆశా, ఉత్సాహమూ, పట్టుదలా ఏవీ లేవు. ఏమో విధి అన్నట్లుగా, నిస్పృహగా ఉండేవి వారి తీర్థయాత్రలే కాదు, జీవితయాత్రలుకూడా.

---

# ఏకాంతాలు

శ్రీ నండూరి వెంకటసుబ్బారావు

౧

ఈ సందె కీ యంద మెవ్వ రిడిరోయీ?
ఆకాశమున విల్లు
అంకాన ఎంకి !

౨

రేయి ముచ్చటల చెలరేగి రెవరోయీ?
నెలవంకదరి చుక్క—
చిలిపి నాపక్క— !

3

పగలురే లెడబా టెరుగ రెవ్వరోయీ?
శంకరుడు, సతి అచట
ఇంకెవ్వ రిచట?

---